నవ్య – నాటా వారి కథల పోటీలో బహుమతి పొందిన కథ

# గోచర



"ముబారక్‌హెూ సలీంభాయ్"

ఆర్టీసీ బస్‌డిపోలో అడుగుపెట్టానో లేదో మిత్రుడు బ్రహ్మం ఎదురొచ్చి నన్ను సంబరంగా గుండెలకు హత్తుకున్నాడు.

మిగతా సహెూద్యోగులూ వచ్చి అభినందనలతో ముంచెత్తారు. వారి ప్రేమాభిమానాలలో తడిసి ముద్దవుతూ మిఠాయిలు పంచాను.

"తల్లీ బిడ్డా బావున్నారు కదా!" అడిగారొకరు.

"చక్కగా ఉన్నారు. కడప అమీన్‌పీర్ దర్గాని దర్శించి వచ్చాం. మా ముంతాజ్ కడుపు పండింది. పండంటి మగ బిడ్డ పుట్టాడు" అక్షరాలా గాలిలో తేలిపోతూ వివరంగా చెప్పాను.

నా ఆనందాన్ని మాటల్లో వర్ణించలేను.

నాకు పెళ్లై పదకొండేళ్ళయ్యింది. ఇక పిల్లలు పుట్టరనే అనుకున్నాం. ఇన్నేళ్ళూ దిగులు దిగమింగుతూ వస్తున్నాం. మా ఊరెళ్ళినప్పుడల్లా ఇంకో నిఖా చేసుకోమని అమ్మీజాన్ గోల చేసేది."ఈ జన్మకి ముంతాజ్ ఒక్కతే" అని తెగేసి చెప్పేవాణ్ణి .

అసలు ముంతాజ్‌ని ముందుగా చూడకుండానే కేవలం పేరు వినే షాదీకి ఒప్పుకున్నా. "సలీం ముంతాజ్‌ని గాక ఇంకెవర్ని పెళ్లి చేసుకుంటాడు!" అని నవ్వారు కజిన్స్.

ఆర్టీసీ డ్రైవర్ని అయినా నన్నో హీరోగా భావిస్తూంటుంది నా బేగమ్. నా మీద ఈగని కూడా వాలనివ్వదు. నాకు తలనొప్పి వస్తే నాకన్నా ముందుగా తనకి తెలిసిపోతుంది. జండూ బామ్‌తో ప్రత్యక్షమవుతుంది.

ఏమైతేనేం మా తపన, తపస్సు ఇన్నేళ్ళకి ఫలించాయి. నిన్న ఆసుపత్రిలో బిడ్డనీ నన్నూ హత్తుకుని ముంతాజ్ ఎన్ని కడవల ఆనందభాష్పాలు రాల్చిందో చెప్పలేను!

"నీ కొడుకు గురించి ఊహలల్లుకుంటూ కూర్చుంటే కాదు మాకు దావత్ ఇవ్వాల్సిందే" అన్నాడు బ్రహ్మం.

మేమిద్దరం తరచూ 27వ నెంబరు రూట్‌కి డ్రైవరూ కండక్టర్లుగా వెళ్తూంటాం.

"ఏం కావాలో చెప్పు భాయ్, అరేంజ్ చేసేస్తా"

"రంజాన్ మాసంలో హలీం తినిపించు" అన్నాడు కళ్ళు చికిలించి నవ్వుతూ.

"నువ్వు తినాలి గాని రోజూ తెచ్చి పెట్టనూ! ఈ మధ్య వెజిటేరియన్ హలీం తయారు చేస్తున్నారు. ఈ సారి తినిపిస్తాలే"

నా మాటలకు ఖుష్ అయిపోయాడు. "ఆ మాట చాలు. తినేసినంత హ్యాపీగా ఉంది సలీం"

"డ్యూటీకి టైమవుతోంది పద..."

ఇద్దరం 27వ నెంబరు బస్సెక్కాం.

బస్‌స్టేజిల దగ్గర యాంత్రికంగా బ్రేకు వేస్తున్నాను. మళ్ళీ ముందుకి దూకిస్తున్నాను. నా మనసంతా ఆసుపత్రిలో ఉన్న ముంతాజ్ మీదా, జాండీస్ వచ్చిందని చెప్పి ప్రత్యేక కేర్‌లో ఉంచిన నా చిన్నారి బిడ్డ మీదా ఉంది.

నా బుజ్జికొండకి ఎంచక్కని బట్టలు కొనాలి. ఎన్నో బొమ్మలు కొనాలి. వాడి బోసి నవ్వులు చూసి మురిసిపోవాలి. ముంతాజ్ వాడికి పాలు ఇస్తూ ఫోజు కొడుతోంటే, చందమామను చూపించి గోరు ముద్దలు తినిపిస్తోంటే, లాలిపాటలు పాడి నిద్రపుచ్చుతోంటే, వాడినీ వాడి ముద్దు మోమునీ, వాడి ఎదుగుదలనీ చూసి ఆకాశం అందినట్టు పొంగిపోవాలి.

వాడు మాకు లభించిన బంగారు వరం! మా ఆశాదీపం! ఆనందపథం!

అకస్మాత్తుగా ఏవో కేకలు విన్పించాయి. ఇహాని కొస్తూనే సడన్‌బ్రేకు వేశాను. కారు క్రింద ఏదో పడింది. బస్సులోంచి అమాంతం క్రిందికి దూకాను.

ముందు చక్రం క్రింద రక్తపు మడుగులో ఆవుదూడ...!

గుండెల్లో పదివేల అగ్నిపర్వతాలు ఒకేసారి బ్రద్దలయ్యాయి. కళ్ళు బైర్లు క్రమ్ముతున్నాయి. వజ వజ వణకుతూ గుండెలు చిక్క బట్టుకుంటూ చూశాను.

నుదుట బొట్టులా నారింజరంగు మచ్చ ఉన్న ఆ దూడ కళ్ళు నా వంకే – కాదు నన్నే చూస్తున్నాయి!

దాని కళ్ళ నుండి కన్నీరు కారటం ఆగింది. నా గుండెల మీద ఆమ్లవర్షం కురవటం మొదలైంది!

ఆ దారుణ బీభత్స దృశ్యం చూడలేక ఎడంగా జరిగాను. నా కళ్ళల్లో గంగా గోదావరి పొంగుతున్నాయి.

జనం పోగవుతున్నారు. ఎ49. ముదుపు ఈనాడు 2009క్కనే గల కాయగూరల మార్కెట్ నుంచి మరెందరో గబగబా వస్తున్నారు. 'ఘోరం!' 'దారుణం' 'కళ్ళు మూసుకుని డ్రైవ్ చేశాడు!' 'కలికాలం!' 'పాపం కాదు పాతకం!'

జనం రకరకాల వ్యాఖ్యానాల ఈటెలు విసుర్తోంటే బ్రహ్మం గబగబా వచ్చి నన్ను దూరంగా తీసుకుపోయాడు.

"పెద్ద ఘోరం జరిగిపోయింది..." ఏడ్చేశాను.

ఇంతలో తల్లి ఆవు 'అంబా' అని అరుస్తూ అక్కడికి వచ్చింది. తుళ్ళిపడి చూశాం. బస్సు చక్రం క్రింద చలన రహితంగా పడివున్న బిడ్డని చూసి స్థాణువయ్యింది. మోరెత్తి దిక్కులు పిక్కటిల్లేలా ఆర్తనాదాలు చేసింది.

నా గుండెల్ని మొండికత్తితో కసబిసా పొడిచేస్తున్నంత బాధ! సుళ్ళు తిరిగిపోయాను!

"అటు చూడకు సలీం. ఇక్కడుంటే ప్రమాదం. వెళ్ళిపో. నేను చూసుకుంటాగా. త్వరగా వెళ్ళిపో..."

ప్రజల మత విశ్వాసానికి దెబ్బ తగిలితే ఏం జరిగేదీ ఊహించగలను. ఆవు దూడ మరణానికి ఒక ముస్లిం డ్రైవరే కారణమని తెలిస్తే ఇంకేమైనా ఉందా? మిన్ను విరిగి మీద పడటం ఖాయం!

గబగబా నడుస్తున్నాను. ఎటు వెళ్తున్నానో కూడా పట్టించుకోలేదు.

మసీదు కన్పించింది. శుక్రవారం. నమాజ్ టైము...

జేబులోంచి టోపీ తీసి తలకి పెట్టుకుని లోపలి కెళ్ళాను. రొటీన్‌గా ప్రార్థించాను గాని ఏకాగ్రత కుదర్లేదు. ఏవో కళ్ళు వెంటాడుతున్నట్టు...ఏదో అశాంతి! మరేదో అంతఃఘర్షణ!

తెలియక చేసిన నేరాన్ని మన్నించమని అల్లాని అశ్రునయనాలతో వేడుకున్నాను.

ఏదో తెలీని ధైర్యం వచ్చింది. తిన్నగా పోలీస్ స్టేషన్ కెళ్ళాను.

"సిటీబస్సు డ్రైవర్ని. యాక్సిడెంటు చేశాను..." ఇన్‌స్పెక్టర్ ఎదుటికెళ్ళి చెప్పాను.

నిలువునా కంపిస్తోన్న నా వంక చూసి పీసీకి సైగ చేశాడు. అతడు మంచినీళ్ళు తెచ్చివ్వగా ఒక్క గుక్కలో తాగేశాను.

"ప్రాణం పోయిందా?"

తలాడించాను.

సర్రుమని కోపం దూసుకురాగా కళ్ళు మూసుకుని నా మీద పడ్డాడు. "నువ్వు మనిషివా దున్నపోతువా? గుద్దితే ప్రాణాలు పోతాయన్న జ్ఞానం లేకుండా ర్యాష్‌గా బస్సు తోల్తావా? ఫుల్లుగా తాగేవా? ఒక మనిషి నిండు ప్రాణం నిలువునా తీసేయడానికి నీకు చేతులెలా వచ్చాయిరా?"

"మనిషి కాదు సార్ ఆవు దూడ..." తడబడుతూ చెప్పాను.

పరమాశ్చర్యపోయాడు. పిమ్మట మిర్రి చూశాడు. రిలీఫ్‌గా ఫీలయ్యాడు. "దానికే మర్డర్ చేసినట్టు వణకి పోతున్నావా?"

తలొంచుకున్నాను.

"రిపోర్టు రాసియ్యి..."

రాసిచ్చాను. అంతా చదివి చివర్లో ఉన్న నా పేరు చూసి అదిరిపడ్డాడు.

"నువ్వు ముస్లిమ్‌వా? తెలుగు బాగా మాట్లాడుతోంటే అనుమానమే రాలేదు. ఇప్పుడు నాకు చచ్చే చావొచ్చి పడినట్టే. మీడియాకి తెలిస్తే గాలి విత్తి సుడిగాలి మొలిపిస్తారు. దీన్ని క్షణాల్లో జాతీయ సమస్య చేసేస్తార్రా దేవుడా...! స్పాట్‌లో ఇంకెవరున్నారు?" కంగారుగా అడిగాడు.

"మా కండక్టర్ బ్రహ్మం ఉన్నాడు..."

"నెంబరు కలిపివ్వు"

ఇచ్చాను. "ఎవరడిగినా డ్రైవర్ పేరు సత్యం అని చెప్పు, తెల్సిందా? సత్యం.

గుర్తుంచుకో”

తిరిగి నాతో అన్నాడు. “రెండ్రోజులు సెలవు పెట్టి ఇంట్లో కూర్చో. బయటికి రాకు సుమా”

స్టేషన్లోంచి బయటపడి ఆసుపత్రి కెళ్ళాను.

“ఏం జరిగింది?” నన్ను చూస్తూనే ఆందోళనగా అడిగింది ముంతాజ్.

ఏమీ లేదని, మరేమీ జరగలేదని బుకాయించానుగాని ఆమె విశ్వసించలేదు.

“జరక్కూడని ఘోరమేదో జరిగింది. నువ్వు దాస్తున్నావ్. మన బిడ్డమీద ఒట్టేసి చెప్పు”

దుఃఖం తన్నుకొచ్చింది. బావురుమన్నాను. తనూ ఏడ్చేసింది. మెల్లగా తమాయించుకుని జరిగిందంతా వివరించాను.

“యా అల్లా!” అరచేతుల్తో ముఖం కప్పుకుని ఏడ్వసాగింది.

“ప్లీజ్ వూరుకో... కావాలని చెయ్యలేదు. నేనెలాటి వాడ్నో నీకు తెలీదూ. మార్కెట్లోంచి హఠాత్తుగా వచ్చి టైరు కిందపడింది...”

నా చెయ్యి గట్టిగా పట్టుకుని బిగ్గరగా రోదిస్తోంటే అంతా గుమిగూడారు. ఏవైందేవైందని ప్రశ్నించారు. బిడ్డకేమైనా అయ్యిందేమోనని భయపడ్డారు.

“లేదు లేదు...!” బిగ్గరగా అరచి స్పెషల్ కేర్ రూం వైపు దూసుకెళ్ళాను.

నర్సు వారిస్తున్నా వినకుండా లోపలికెళ్ళాను.

మా బిడ్డ క్షేమంగా ఉన్నాడు. హాయిగా నిద్రపోతున్నాడు. గాఢంగా నిట్టూర్చి వచ్చాను.

“బాగున్నాడు కదా?”

“ఖుదా హమారే సాత్ హై” ముంతాజ్ని కావలించుకుని ఆమె నుదుట ముద్దు పెట్టుకున్నాను.

నర్సు వచ్చి, “నీకు పాలు వస్తున్నాయా?” అడిగింది.

తల అడ్డంగా ఊపింది ముంతాజ్. రెండు వేడి కన్నీటి బొట్లు ఆమె కనుకొనకల్నుంచి రాలిపడ్డాయి. నా గుండె పట్టేసింది.

“పచ్చి బొప్పాయి కూర తింటే త్వరగా పాలు పడతాయి...” అంటూ కొన్ని సూచనలిచ్చి వెళ్ళింది.

ముంతాజ్ మంచం దిగి, నేలమీద కూర్చుని, తల మీదకి చున్నీ లాక్కుని మక్కా వైపు తిరిగి అరచేతులు దోసిలిగా పట్టుకుని నమాజు చేసింది. ఆమె నా గురించే ప్రార్థించిందని ఊహించగలను. అశ్రునయనాలతో అభిమానంగా చూస్తూండిపోయాను.

మా అదృష్టవశాత్తూ ఆ ప్రమాదం గొడవగా మారలేదు. బ్రహ్మానికి ప్రత్యేకంగా ‘థాంక్స్’ చెప్పాను.

మూడో రోజున డ్యూటీలో జాయినయ్యాను. అంతా దాన్నో యాదృచ్ఛిక ఘటనగా

భావించడం చూసి నిశ్చింతగా ఫీలయ్యాను.

మళ్ళీ అదే బస్సు. అదే రూటు. స్టీరింగు పట్టుకున్నాను గాని ఎంచేతో చేతులకి చెమటలు పట్టాయి. ధైర్యాన్ని కూడదీసుకున్నాను.

బస్సు వెజిటబుల్ మార్కెట్ ప్రాంతానికెళ్తోంది. నా గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి.

అమాంతం ఒక ఆవు పరుగు పరుగున బస్సుకెదురు రాసాగింది. బ్రేకు వేసి గుటకలు మ్రింగుతూ భయం భయంగా చూశాను.

ఆవు బస్సు చుట్టూ తిరిగింది. దాని దూడ మీంచి వెళ్ళిన ముందరి టైరుని నాకింది. మౌనంగా కన్నీరు కారుస్తూ నిలబడిపోయింది.

నా గుండెల్జారిపోతోంటే బ్రహ్మం వంక బేలగా చూశాను. బస్సులోని ప్రయాణీకులంతా వింతగా చూడసాగారు.

బ్రహ్మం కోరగా కొందరు జనం ముందుకొచ్చి ఆవుని అదిలించారు. అది కొంచెం దూరం వెళ్ళి, వెనుదిరిగి, బస్సువంకే చూడసాగింది. అద్దంలో 'అదేం చేస్తుందా' అని ఊపిరి బిగబట్టి ఉత్కంఠతో చూస్తోంటే, "రైట్ రైట్" అన్నాడు బ్రహ్మం. బ్రేకుమీంచి కాలు తీస్తూ గేరు మార్చాను.

అన్యమనస్కంగా టీ త్రాగుతోంటే, "టైర్లన్నీ శుభ్రంగా కడిగారు. అయినా అదే బస్సు అదే చక్రం అని ఆ ఆవుకెలా తెలిసిందో!" అన్నాడు బ్రహ్మం. అతడి ముఖంలోని ఆందోళన నన్ను భయపెట్టింది. గుటకలు మ్రింగాను.

"నాకూ చిత్రంగానే అన్పిస్తోంది... ఈ బస్సుని రేపు ఇంకో రూటుకి మార్చమంటాను" అన్నాను.

"అదే మంచిది..."

* * *

ముంతాజ్‌నీ బిడ్డనీ ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు.

మందులూ మాకులూ వాడినా సరే తనకి పాలు పడలేదు. ముప్పై ఏళ్ళు దాటేక గర్భం దాల్చిన కొందరికి ఇలాగే జరుగుతుందని చెప్పారు. ఆవు పాలు తల్లిపాలతో సమానమనీ, తేలికగా జీర్ణమవుతాయనీ చెప్పి వాటిని పట్టించమన్నారు.

మా బిడ్డకు తల్లి పాలు తాగే యోగం లేకపోవడం మమ్మల్ని తీవ్రంగా కలచి వేసింది. వాడికి ఇదేం శాపమో అర్థంగాకుండా ఉంది.

మా బాధని వేదనని కళ్ళల్లోనే అణచుకుని డెయిరీ ఆవుపాలు పట్టించాం. గొట్టంలా విరోచనాలవ్వసాగాయి. రెండ్రోజులకే డీలాపడి కళ్ళు తేలేశాడు.

వాణ్ణి తీసుకుని ఆసుపత్రికి పరుగెత్తాం. సెలైన్ ఎక్కించాక కుదుట పడ్డాడు.

"డెయిరీ పాలు వాడొద్దు. నిల్వ ఉండటానికి ఏవేవో కెమికల్స్ కలుపుతారు. అవి అందరు పిల్లలకీ పడవు. ఒంటికి మంచిదీ కాదు. అప్పుడే పొదుగు నుండి పిండిన పాలకోసం ట్రై చెయ్యండి" డాక్టరమ్మ సలహా ఇచ్చింది.

వాకబు చేయగా ఒకచోట చిన్న డెయిరీ ఫాం ఉందని తెలిసింది. స్టీలు కేరియర్ తీసుకుని వెళ్ళాను.

అయిదు ఆవులున్నాయి. వాటిని చూడగానే ప్రాణం లేచొచ్చింది. కాని ఎంచేతో అవన్నీ ఒకేసారి తలెత్తి నా వంక 'అదోలా' చూశాయి.

నా గొంతు తడారిపోయింది. తలొంచుకునెళ్ళి రైతుని కలిశాను. రోజుకి అరలీటరు చొప్పున నాకు పాలు పోయడానికి అంగీకరించాడు.

బాబుకి ఈ పాలు పడ్డాయి. అవి తాగి కాళ్ళూ చేతులూ ఆడిస్తూ ముచ్చటగా నవ్వసాగాడు.

ఎలాగైతేనేం వాడి ఆహార సమస్య తీరినందుకు ఎంతో సంతోషించాం.

వారం రోజుల గ్యాప్ తర్వాత 27 నెంబరు రూటుకి అదే బస్సుని డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళాను.

ఆ ఆవు ఈ పాటికి బిడ్డ చావుని మరచిపోయి ఉంటుందని ధీమాగా ఉన్నాను. అయినా బస్సు మార్కెట్‌ని సమీపిస్తోంటే మనస్సునిండా ఒకటే అలజడి! అపరాధ భావన!

సరిగ్గా ఆ స్పాట్‌లో బస్సు ఆగిందో లేదో ఉరుకులు పరుగులు మీద ఆ ఆవు వచ్చేసింది. అది బస్సు చుట్టూ కల తిరుగుతోంటే నా కళ్ళ నుంచి కన్నీళ్ళు ధారలు కట్టాయి. ఎవరో కొరడాతో చెళ్ళు చెళ్ళున కొడుతున్నట్టు అన్పించి మథనపడ్డాను.

"హారన్ కొట్టు సలీం. పశువుల్ని ఊరికే రోడ్డు మీదకి వదిలేస్తారు. పొరబాటున వాటిని గుద్దితే మన పీక పట్టుకుంటారు" కండక్టర్ సుబ్బారావు అన్నాడు. అతడికి అవాళ జరిగిన ఘోరం గురించి తెలీదు!

నేను బస్సు దిగి వెళ్ళి చిన్నగా అదిలించాను. ఎడంగా వెళ్ళి నా వంక కోపంగా కాదు – దీనంగా చూసింది!

అశ్రునయనాలు తుడుచుకుంటూ బస్సెక్కి ముందుకి దూకించాను. కన్నీటి తెరలోంచి రోడ్డు అస్పష్టంగా కన్పిస్తోంది. అయినా పట్టించుకోలేదు.

ఆ మర్నాడు మళ్ళీ అదే బస్సులో అదే రూటుకి వెళ్ళాను. ఒక పొడవాటి కర్ర కూడా బస్సులో పెట్టుకున్నాను. ఆ ఆవు చూపుల కొరడాల దెబ్బలు తట్టుకునే శక్తి నాకింక లేదు గాక లేదు. అందుకనే దాన్ని దూరంగా ఎప్పుడూ నా కంటబడనంత దూరానికి తరిమెయ్యాలని నిశ్చయించుకున్నాను.

కావాలనే మార్కెట్ దాటాక ఆ స్పాట్‌లో బస్సు నాపి ఆవు కోసం చుట్టూ కలయ జూశాను. బస్సులోని జనం నావంక వింతగా చూస్తున్నా లెక్క చెయ్యలేదు. కనుచూపు

మేరలో ఆవు కన్పించలేదు. బహుశా ఎక్కడికో పారిపోయి ఉంటుందనుకుంటూ గేరు మార్చబోయానో లేదో ఎన్నో ఆవులు ఒక్కుమ్మడిగా నలువైపుల్నుంచీ బస్సుమీద దాడి చేశాయి. కొమ్ముల్తో బస్సుని కుమ్మేయసాగాయి. బస్సు నొక్కుకుపోతోంది. లోపల నేనొక్కణ్ణీ ఊపిరాడక గిలగిల తన్నుకుంటూ ఆర్తనాదాలు చేస్తూ...!

కెవ్వున అరుస్తూ లేచి కూర్చున్నాను. ఒళ్ళంతా ముచ్చెమటలతో తడిసి ముద్దయ్యింది. బిక్కచచ్చి చుట్టూ బిక్కు బిక్కుమని చూస్తోంటే బాబు సైతం కెవ్వు కెవ్వుమని ఏడవసాగాడు.

"అలా అరిచావేంటి? పీడకల వచ్చిందా?" బాబుని సముదాయిస్తూనే ఆందోళనగా అడిగింది ముంతాజ్.

నా నోట్లోంచి మాట రాలేదు. నోరు పిడచకట్టుకుపోయింది!

నేరపూరిత భావన నన్ను నిలువునా నలిపేస్తోంటే భయంభయంగా చూస్తూండిపోయాను!

* * *

నా భయాన్ని ఆవేదనని బ్రహ్మం ముందు వెళ్ళగక్కాను.

"అలాంటి పాపాలకు మీ మతంలో ఏదో ప్రాయశ్చిత్తం ఉండి ఉంటుందిగా. అది చేస్తాను. నువ్వే హెల్ప్ చెయ్యాలి బ్రహ్మం"

"నాకు తెలిసిన శాస్త్రిగారున్నారు. ఆయన్ని కలుద్దామా?"

"ఆయన నా తపన, ఆరాటం అర్థం చేసుకుంటారంటావా?"

"మతం వేరు నమ్మకాలు వేరు. ఆత్మచింతన వేరు, ప్రాపంచిక చింతన వేరు. కడప, కర్నూలు జిల్లాలోని కొందరు ముస్లింలు బీబీ నాంచారిని పెళ్ళాడాడు గనుక తిరుపతి వేంకటేశ్వరుణ్ణి తమ అల్లుడిగా భావిస్తారు. కానుకలూ సమర్పిస్తారు. అంతెందుకు, వేంకటేశ్వర స్వామికి ప్రతి మంగళవారం చేసే అష్టదళ పాద పద్మారాధనకి ఉపయోగించే 108 బంగారు పుష్పాలు ఒక మహమ్మదీయ భక్తుడు బహూకరించినవే!"

బ్రహ్మం సమాధానం నన్ను సమాధాన పరచింది. నా అంతఃసంఘర్షణ నుంచి నన్ను విముక్తి చేసే ఆశారేఖ కళ్ళముందు మెరిసింది.

మేం వెళ్ళేసరికి శాస్త్రిగారు పట్టుబట్టలు ధరించి, నుదుట నామం దిద్దుకుని, వీధి అరుగుమీద పద్మాసనం వేసుకుని ఏదో గ్రంథం పఠిస్తున్నారు.

నేను మెట్లమీదే ఆగిపోయాను. బ్రహ్మం అరుగు ఎక్కి ఆయనకి నమస్కరించి జరిగిందంతా వివరించాడు.

"తెలిసి చేసినా తెలియక చేసినా గోహత్య మహా పాపమే. పాతకమే. దానికి నిష్కృతి లేదు. గోమాత శుభానికి పవిత్రతకి చిహ్నం. గోక్షీరం, గోమూత్రం, గోపేడ అన్నీ పవిత్రమైనవే. గోవు విషం తిన్నా సరే అది కంఠంలోకి కండరాల్లోకి వెళుతుంది తప్ప పాలు, మూత్రం,

పేడలలో కలవదు. ఆక్సిజన్ పీల్చుకుని తిరిగి ఆక్సిజన్‌ని విడిచే ఏకైక ప్రాణి ఆవు. అందుకే పరమ పవిత్రమైనదైంది. గోవు చరించిన ప్రాంతమెప్పుడూ పాడి పంటలతో సుభిక్షంగా ఉంటుంది. హుఁ. వాటి విలువ, గొప్పతనం ఇతగాడికేం తెలుస్తుందీ!" వ్యంగ్యంగా నవ్వారు.

ఆయన మాటలు నా గుండెల్లో శూలాల్లా దిగాయి. భయోద్విగ్నుడ్నై ఆయన వంకే ప్రాధేయ పూర్వకంగా చూశాను.

"చాలా ఫీలవుతున్నాడు. పశ్చాత్తాప పడుతున్నాడు. మీరే ఏదో మార్గం చూడాలి..."

బ్రహ్మం మాటలకి నా ముఖంలోకి సూటిగా చూశారు. "గోచర!" అన్నారు.

అయోమయంగా ముఖా ముఖాలు చూసుకున్నాం ఇద్దరం.

"అతడి ముఖంలో గోచర స్పష్టంగా గోచరిస్తోంది. గోచర అంటే గోవు నడకే కాదు అంతరాత్మ, తెలుసుకొనుట, విషయ జ్ఞానం అని కూడా అర్థాలున్నాయి. అతడి అంతరాత్మ అతడ్ని నిలువునా దహించేస్తోంది!" తీక్షణ దృక్కుల్తో నన్ను చూస్తూ కఠినంగా అన్నారు.

అగ్నిశిఖరం మీంచి మంచులోయలోకి తోసేయబడినట్టు విలవిల్లాడాను.

"అందుకనే మిమ్మల్ని ఆశ్రయించాం. అన్నీ తెలిసిన వారు. సహనం, సహిష్ణుత గలవారు. పెద్ద మనస్సు చేసుకుని ఏదో దారి..."

హేళనగా నవ్వారు. "ఇతగాడు గోదారి ఈదలేదు, దాటలేదు. అదేమీ సులభ సాధ్యమైంది కాదు. వేయి గోవుల్ని దానం చేసినా ఇతడు చేసిన పాపం పోదు. ఒక గోవు తన జీవితకాలంలో 4,10,400 మందికి ఒక పూట భోజనం ఇస్తుందన్నది ఇతగాడి ఊహకి అందుతుందా? గోహత్య సునాయాసంగా చేసేయొచ్చు. ఏదీ ఒక్క గోమాతకి ప్రాణం పోయమను చూద్దాం. అసంభవాన్ని సంభవం చేసే శక్తి నాకు లేదు. మహా పాపాన్ని పరిహరించే యుక్తి నాకు తెలీదు. ఎంతటి వారైనా సరే ఎవరి కర్మను వాళ్ళు అనుభవించక తప్పదు!"

బ్రహ్మం నిస్సహాయంగా నా వంక చూశాడు. నేనక్కడ్నుంచి విసవిసా వచ్చేశాను.

మరో ఆలోచన లేకుండా తిన్నగా కబేళాకి వెళ్ళాను. ఎన్నో జంతువుల్ని తీసుకొస్తున్నారు. అమ్మేస్తున్నారు. వెళ్ళిపోతున్నారు. లోపల మూగజీవాల ఆక్రందన నిశ్శబ్దంగా ప్రతిధ్వనిస్తోంది.

గుండెలు బిగబట్టుకుని నిరీక్షించాను. ఒక ట్రక్కులో ఇతర పశువులతో బాటు బక్క చిక్కిన ఒక ఆవుని కూడా తీసుకొచ్చారు. ఏ కరవు ప్రాంతం నుండి తీసుకొచ్చారో మరి!

వారి దగ్గరి కెళ్ళి ఆ ఆవుని నాకు అమ్మమని కోరాను.

"ఇలాంటిది దానం చేస్తే ఎలాంటి పుణ్యమూ రాదు. దానమిచ్చిన ఆవు పాలు దానం తీసుకున్న వారి కుటుంబం తాగితేనే ఫలం ఉంటుంది"

వాదనకి దిగలేదు. దాన్ని కొనుక్కుని మినీ ట్రక్కులో ఇంటికి తోలుకెళ్ళాను.

ఆవుని చూసి బోలెడు సంబరపడిపోయింది ముంతాజ్. "నువ్వెంత మంచివాడివి. మన బాబుకోసం ఏకంగా ఆవునే కొనుక్కొచ్చేశావా!"

"ఇది పాలు ఇవ్వదు. ప్రాణంతో ఉందంతే"

మా ఇంటి పెరట్లో కాస్త జాగా ఉండటం మాకు బాగా కలిసొచ్చింది. అక్కడ దాన్ని కట్టేసి పచ్చగడ్డి తెచ్చి వేశాను. ఆబగా తిని ఇన్ని నీళ్ళు త్రాగింది.

ఆ దృశ్యం చూస్తూనే ముంతాజ్ సంబరంగా అరిచింది. "నా జాకెట్టు పాలతో తడిసిపోయింది!"

పట్టరాని ఆనందంతో ఆవు ఒళ్ళు నిమిరాం. ముద్దు పెటుకున్నాం.

మరింత అపురూపంగా పెంచసాగాం. మా బుడ్డోడు కూడా దాని వంక ఇంతింత కళ్ళతో చూస్తున్నాడు. చిరునవ్వులు చిందిస్తున్నాడు.

అదేమి చిత్రమోగాని ఆ తర్వాత అదే బస్సులో అదే రూట్లో ఎన్నిసార్లు వెళ్ళినా ఆ ఆవు మరి కన్పించలేదు!

మా ఆవు చక్కగా తయారైంది. పుష్టిగా ఉంది. ఎదకు వచ్చింది. పశువులాసుపత్రికి తీసుకెళ్ళాను. వాళ్ళు సంపర్కం ఏర్పాటు చేశారు. కొద్దిరోజులకే సూడిదయ్యింది.

మా సంతోషానికి అవధులు చెరిగిపోయాయి.

ఆవు కళ్ళు మమ్మల్ని చల్లగా దీవిస్తూ చూస్తున్నాయి. ఆవు మా కళ్ళముందు సంచరిస్తూ అనునిత్యం ఆనందామృతాన్ని దోసిళ్ళతో పంచుతోంది. ఒక వ్యాపకం కల్పించటమే గాక మాకు తెలీకుండానే మా కుటుంబ సభ్యురాలైపోయింది.

"గాయ్‌ని కొన్నావుట, ఏవిటి విశేషం?" మా ఇంటికొచ్చిన దోస్త్ అడిగాడు.

'ఆవు పాలలో రసాయనం, ఆవు నెయ్యిలో అమృతం ఉన్నాయి. ఆవు మాంసం తింటే రోగిస్టులవుతారు' అని మహమ్మద్ ప్రవక్త చెప్పాడని ఎవరో ఎప్పుడో చెబితే విన్నది గుర్తొచ్చింది. మౌనంగా ఉండిపోయాను.

ముంతాజ్ నెలలు నిండుతోన్న ఆవు గురించి గొప్పగా చెప్పింది. మ్రాన్పడి విన్నాడతడు!

మా ఆవు ఈనింది. చిన్ని దూడకి జన్మనిచ్చింది. ఈ దూడ అచ్చంగా ఆ దూడలానే ఉంది. ముఖం మీద బొట్టులా నారింజరంగు మచ్చ సైతం ఉంది!

నా పాపమంతా పటాపంచలైనట్టు పొంగిపోయాను. వెర్రి సంబరంతో ఆవు మెడ చుట్టూ చేతులు చుట్టి కావలించుకున్నాను.

ఆవు కళ్ళల్లోకి చూస్తూ ముట్టె నిమురుతూ అన్నాను "నిన్నూ నీ సంతతినీ సంరక్షిస్తాను. అల్లాకే కసమ్!"

* * *

**(నవ్య వారపత్రిక - 17-8-2016)**